

- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు మరోసారి నిరాశే..
- పెండింగ్ ప్రాజెక్ట్‌లకు నిధులు కేటాయింపు అంతంత మాత్రమే
- రైల్వే కేటాయించిన బడ్జెట్‌లో డబుల్‌లైన్,కొత్త లైన్లకు నిధులు వచ్చేనా?
- రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు
- రైతులు, వేతన జీవులకు ప్రాధాన్యత కల్పించిన బడ్జెట్
- సామాన్యుడికి ఉపయోగపడని బడ్జెట్ అంటున్న జిల్లాలోని ప్రతిపక్షాలు
- రాష్ట్రాన్ని విస్మరించిందన్న కాంగ్రెస్
- అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందంటున్న బీజేపీ
- బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందనత



మొండిచేయి!

నిజామాబాద్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ కామారెడ్డి (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మొండిచేయి చూపింది. ఈ బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఎంతగానో ఆశలు పెట్టుకున్నా పెద్దగా ప్రయోజనం కలగలేదు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని కొత్త సంక్షేమ పథకాలు ప్రకటిస్తారని అంతభావించారు. సంక్షేమ పథకాలపై కేంద్రం కరుణచూపి బడ్జెట్‌లో కాస్త ఊరట కల్పించేవిధంగా కేటాయింపులు చేశారు. కానీ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్‌ల ఊసే ఎత్తలేదు. రైల్వేకు కేటాయించిన బడ్జెట్‌లో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లకు ఏ స్థాయిలో నిధులు వస్తాయో చూడాలి. ఇక జాతీయ రహదారుల నిర్మాణ పనులపై ఊసే ఎత్తలేదు. అభివృద్ధి పనులపై కేంద్రప్రభుత్వం మరోసారి నిరాశపరిచిందని పలువర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరాల జల్లు కురిపిస్తుందని అనుకున్న ప్రజలకు కేంద్రం నిరాశే చూపినట్లు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడే విధంగా లేదని తెలంగాణ రాష్ట్రాన్ని కేంద్రం విస్మరించిందని ప్రతిపక్ష నేతలు వాపోతున్నారు. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలను దృష్టిలో పెట్టు కునే అమలుకాని హామీలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులు చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. అదేవిధంగా కేంద్ర ఆర్థికశాఖమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ అభిప్రాయం వ్యక్తం చేస్తుంది. ఉచితాలకు తావులేకుండా పేదవర్గాలకు ఉపయోగకరంగా ఉండేపథకాలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత కల్పించారని బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు, వేతన జీవులకు ప్రాధాన్యత కల్పించిన బడ్జెట్

కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు అధికార ప్రాధాన్యత కల్పించింది. ఈ బడ్జెట్‌లో పలు కీలక నిర్ణయాలను తీసుకుంది.రైతులు,వేతన జీవులకు ఊరట కల్పించింది. ప్రధాన మంత్రి ధన్‌ధ్యాన్‌యోజన ద్వారా దేశంలో వెనుకబడిన జిల్లాలో వ్యవసాయానికి ప్రోత్సహం అందించేందుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించారు.

12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు

కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యుడికి ఊరట నిచ్చేవిధంగా ఆదాయ పన్ను మినహియింపు ప్రకటించారు.ఈ బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు ఇస్తారని మధ్యతరగతి ప్రజలు ఆశించారు. అందుకు అనుగుణంగానే ఈ బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయిస్తూ కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రకటించారు. దీంతో సామాన్య ప్రజలకు కాస్త ఊరట లభించనుంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు పన్ను రూపంలో రూ.80 వేల ఆదాయం కానున్నాయి. రూ.20లక్షల నుంచి రూ.24లక్షల వరకు 25శాతం రూ.16లక్షల నుంచి రూ.20లక్షలలోపు ఆదాయంపైన 20శాతం పన్ను స్లాబులుగా ప్రకటించారు. ఇన్‌కాంట్యాక్స్‌లో ఉన్న అనవసర సెక్షన్‌లను కేంద్ర ప్రభుత్వం తొలగించనుంది.

ఉమ్మడి జిల్లా ప్రాజెక్ట్‌లకు నిధులు విడుదలయ్యేనా?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్‌లకు, జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌ప్రవేశ పెట్టిన ఆయా శాఖలకు కేటాయించిన నిధుల నుంచి కేటాయింపులు వస్తాయో.. లేవో చూడాలి. మహారాష్ట్రలోని ముత్కేడ్ నుంచి నిజామాబాద్ హైదరాబాద్ వరకు డబుల్ రైల్వే లైన్ ఏర్పాటుకు గత సంవత్సరం కిందటే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ పనులకు కేంద్ర రైల్వే శాఖ నిధుల ఖర్చు ప్రతిపాదనలు చేసింది. బోధన్-బాన్సువాడ-బీదర్ పనుల కోసం ఈ బడ్జెట్‌లో రైల్వే శాఖకు కేటాయించిన నిధులోంచి ఎన్ని వస్తాయో చూడాలి. కరీంనగర్, కామారెడ్డి, పిట్లం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సైతం ఈ బడ్జెట్ నిధులు కేటాయించాల్సి ఉంటుంది. గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.2.66లక్షల కోట్లు, విద్య రంగానికి రూ. 1.28 లక్షల కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.98.311 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.96, 777 కోట్లు, ఐటీ టెలికాం రంగానికి రూ.95,298 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.81, 174 కోట్లు, వాణిజ్య, పరిశ్రమలకు రూ.65, 553 కోట్లు, సామాజిక సంక్షేమానికి రూ.60,052 కోట్లు కేటాయించారు. ఇలా పలురంగాలకు నిధులను బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

మైనార్టీ, దళిత మహిళల భద్రత ప్రస్తావన లేదు



- షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారుడు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీ, దళిత మహిళల భద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఈ బడ్జెట్‌లో ఆ వర్గాల రక్షణకు ప్రస్తావన చేయలేదు. ఆంధ్ర, బీహార్‌లకు ప్రకటించిన దాంట్లో తెలంగాణకు 25శాతం కూడా ప్రకటించలేదు. తెలంగాణకు ఇండియన్ ఐఐఎం, ట్రిపుల్ ఐటీ కేటాయించాలని కోరుతున్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. 8మంది బీజేపీ ఎంపీలు ఉన్నా.. దక్కింది ఏమీలేదు.

రాష్ట్ర ఊసే లేని కేంద్ర బడ్జెట్



- వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారు. ఇది బీహార్ బడ్జెట్‌గా ఉంది. గత కొన్నేళ్లుగా రాష్ట్రానికి నవోదయ, సైన్స్ స్కూళ్లు, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ లాంటి విద్యాలయాల ఏర్పాటు చేయాలని కోరిన బడ్జెట్‌లో వాటి ఊసే లేదు. రాష్ట్రానికి ఉపయోగపడే విధంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపయోగం లేదు. తెలంగాణ నుంచి ప్రాంతీయ పార్టీల ఎంపీలు లేకపోవడం వల్ల అన్యాయం చేశారు.

ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్



- దినేష్‌కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు సంక్షేమానికి మేలు చేయనుంది. మధ్యతరగతికి ఉపయోగపడుతుంది. మహిళ, యువత సాధికారతకు మేలు చేస్తుంది. వ్యవసాయం, విద్యారంగం, గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి కేటాయింపులను చేశారు. చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి పరిమితిని రూ.5కోట్ల నుంచి రూ.10కోట్లకు పెంచారు. రైతుల కోసం కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచడం వల్ల వారికి మేలు చేస్తుంది. వార్షిక ఆదాయం రూ.12లక్షల వరకు పన్ను రద్దుతో కోట్లాది ఉద్యోగులకు మేలు జరుగుతుంది.

రాష్ట్రానికి, జిల్లాకు ఉపయోగం లేని బడ్జెట్



- మానాల మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన విజ్ఞప్తులకు అనుగుణంగా కేటాయింపులు చేయలేదు. బడ్జెట్‌లో రాష్ట్రాన్ని పట్టించుకోలేదు. జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటుచేసిన దానికి నిధుల కేటాయింపు లేదు. అన్ని రంగాలను విస్మరించి బడ్జెట్ కేటాయింపులను చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న ప్రాంతాలకే ఎక్కువగా కేటాయింపులను చేశారు.

మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడుతుంది



- దేగాం యాదాగౌడ్, టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్

కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉంది. పన్ను మినహాయింపు రూ.12లక్షల వరకు ఇవ్వడం ఊరట కలిగించింది. క్యాన్సర్‌కు సంబంధించిన మందులతో పాటు ఇతర మందులకు ట్యాక్స్ తగ్గించడం మేలు జరుగుతుంది. రైతులకు సంబంధించి గిట్టుబాటు ధర కోసం విధివిధానాలు చేసి కేటాయింపులు చేస్తే మరింత మేలు జరుగుతుంది.

పేదలను నిండా ముంచే బడ్జెట్



- పెద్దివెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం

బడ్జెట్ పేదలను ముంచేలా ఉంది. ఉపాధి హామీకి గత ఆరేళ్లుగా కేటాయింపుల్లేవు. 200 పనిదినాలు కల్పించాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకోలేదు. వేతనం రూ.600 పెంచాలని కోరినా నిధుల కేటాయింపులు చేయలేదు. రైతులు మద్దతు ధర కోసం ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటాలు చేస్తున్నా పట్టించుకోలేదు. నిజామాబాద్ పసుపు బోర్డుతో పాటు ఇతర రంగాలకు కేటాయింపులు చేయలేదు.

కార్మిక వ్యతిరేక బడ్జెట్ ఇది



- ఓమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ

బడ్జెట్‌లో కార్మికులకు ఉపయోగపడే నిధుల కేటాయింపు చేయలేదు. మధ్య, చిన్నతరహా పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోలేదు. ఆ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఉపాధి లేకుండా రోడ్డున పడుతున్నా బడ్జెట్‌లో ప్రస్థావన లేదు. కార్మికుల కోసం ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించలేదు. ఉద్యోగాల కల్పన కోసం నిరుద్యోగులకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయలేదు.



వీసీలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి.. పాల్గొన్న కలెక్టర్, అధికారులు

శాసన మండలి ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పక్కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాలతో కూడిన పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన చర్యల గురించి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సీఈవో దృష్టికి తెచ్చారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 33 మండలాల్లో 48 పోలింగ్ కేంద్రాల పరిధిలో 30వేల 593 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 33 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3వేల 529 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావ ళి కట్టుదిట్టంగా అమలయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణ జరుపుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు సంబంధించి పాటించాల్సిన నిబంధనల గురించి ఎన్నికల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్స్, జెండాలు, ప్రకటనలను తొలగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఎక్కడ కూడా ఏ చిన్న అలసత్వానికి సైతం తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంసీఎంసీ కమిటీని ఏర్పాటు చేశామని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రసారాలను నిశితంగా పరిశీలన జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనలకు అనుగుణంగా జారీ చేస్తామన్నారు. ఈసీ మార్గదర్శకాల మేరకు నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను తప్పిదాలకు తావులేకుండా పక్కాగా రూపొందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టీచర్స్, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీలించి ఈనెల 7వ తేదీలోపు పరిష్కరించాలని గడువు విధించారు. పోలింగ్‌కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఫిబ్రవరి 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగే పోలింగ్ ప్రశాంత వాతావరణంలో పూర్తి పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సిబ్బందిని నియమిస్తూ వారికి శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డెంటల్ వైద్యానికి స్వర్ణయుగం

- 9వ రాష్ట్రస్థాయి జనరల్ కాన్ఫరెన్స్‌లో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి






మాట్లాడుతున్న డెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహస్వామి, కార్యదర్శి చలపతిరావు, ఎమ్మెల్యేలు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ రాజేష్‌రెడ్డి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు


డిచ్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 2025లో దంత వైద్యానికి స్వర్ణయుగం రానుందని, సీనియర్ వైద్యులు ఈ వైద్యం పట్ల జూనియర్లను కూడా ప్రోత్సహించి దంత వైద్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శనివారం మండలంలోని బర్ధిపూర్ శివారులో గల కృష్ణ హోటల్‌లో 9వ రాష్ట్రస్థాయి డెంటల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సదస్సుకు హాజరైన ప్రముఖ వైద్యుడు, ఆదోని శాసనసభ్యుడు పార్థసారధి మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగే ప్రతీ డెంటల్ సదస్సులో తాను పాల్గొంటానన్నారు. దంత వైద్యంపై ఎక్కడ కూడా చరిష్మ తగ్గలేదన్నారు. రాష్ట్రస్థాయి డెంటల్ సదస్సును నిజామాబాద్‌లో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2025లో 125 దంత క్లీనిక్‌లు పెట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఇందుకు సహకారం కల్పిస్తే క్లీనిక్‌లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. గతంలో టెక్నాలజీ లేదని, కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా లేవన్నారు. తాను చదువుకున్న సమయంలో నిజామాబాద్ జిల్లాలో నందకుమార్ పేరు మాత్రమే వినిపించేదన్నారు. తాను ఆరేళ్ల క్రితమే బీజేపీలో చేరానని.. ఇటు ఎమ్మెల్యేగా రాణిస్తూ దంత వైద్యానికి ప్రత్యేక సేవలు అందిస్తున్నానని తెలిపారు. ప్రధాని మోదీ తనకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. ఢిల్లీలో జరిగే ఎన్నికల్లో తనకు కూడా ఒక నియోజకవర్గ బాధ్యత ఇచ్చారని, కాన్ఫరెన్స్ కోసమే నిజామాబాద్ రావడం జరిగిందని తెలిపారు. అనంతరం నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచికుల్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. డెంటల్ విద్యార్థులు పరిశోధన రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో డెంటల్ వైద్యంపై మరిన్ని ప్రోత్సాహకాలు పెరగాలని, ఇందుకు ప్రభుత్వాలు కూడా

(తరువాయి 10వ పేజీలో..)

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై

ప్రధాన పార్టీల దృష్టి!

- రెండు పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో.. ఏర్పాట్లు చేసుకుంటున్న నేతలు
- నామినేషన్ల ప్రక్రియ తర్వాత ప్రచారానికి సిద్ధమవుతున్న అభ్యర్థులు
- పోటీకి బీఆర్ఎస్ నుంచి రాని ప్రకటన
- స్వతంత్ర అభ్యర్థులను బుజ్జగించే పనిలో కాంగ్రెస్, బీజేపీ



నిజామాబాద్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారం కోసం ఏర్పాట్లను చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి అభ్యర్థిని పోటీలో దించే అవకాశం లేకపోవడంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ కొనసాగనుంది. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో ఉండనుండటంతో నామినేషన్లకు ముందే అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఆయా మండలాలు, డివిజన్ కేంద్రాల్లో రెండు పార్టీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 3 నుంచి నామినేషన్ స్వీకరణ ఉండటంతో పార్టీ నాలుగు జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సీనియర్ నేతలు హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. పార్టీ నేతల మద్దతుతో నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సోమవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీతోపాటు టీచర్ ఎమ్మెల్సీకి కరీంనగర్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈనెల 27న ఈ ఎన్నికలకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న కౌంటింగ్ చేపడుతారు.

అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, బీజేపీ

ఈ ఎన్నికల్లో పోటీ కోసం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ప్రధాన పార్టీల అభ్యర్థులను ఖరారు చేయడంతో వారు ప్రచారం కోసం సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోసం కరీంనగర్ ఆల్ఫోర్స్ సంస్థ యజమాని నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. పార్టీ ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డికి పెద్దల సభకు మరో దఫా ఎమ్మెల్యే కోటాలో అవకాశం ఇవ్వనుండటంతో ఆయన పోటీకి దూరంగా ఉన్నారు. ఆయన స్థానంలో నరేందర్‌రెడ్డిని ప్రకటించడంతో నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి ఉండటంతో మరో దఫా గెలిచేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సీనియర్ నేతలతో కలిసి ప్రచారం చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున నిరుద్యోగుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూనే మద్దతు కూడగట్టేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉండటం వల్ల నిరుద్యోగులకు హామీలు ఇవ్వడంతో పాటు గ్రాడ్యుయేట్ కోసం ప్రభుత్వం ఏం చేస్తుందో వివరించేందుకు నేతలు ఏర్పాట్లను చేస్తున్నారు. కలిసి కట్టుగా ప్రయత్నాలు చేయడంతో పాటు సిట్టింగ్ స్థానం నిలుపుకునే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ఆయా ఉమ్మడి జిల్లాలకు మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించి ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. బీజేపీ తరపున అంజిరెడ్డిని నెలరోజుల ముందే అధిష్టానం ప్రకటించింది. పార్టీ నేతలు కూడా ఇప్పటికే కొన్ని జిల్లాల పరిధిలో సమావేశాన్ని నిర్వహించారు. గ్రాడ్యుయేట్‌ల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీకి చెందిన అన్ని విభాగాల నేతలను రంగంలోకి దించి ప్రచారం నిర్వహించుకునేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్లు వేయడంతో పాటు అన్ని జిల్లాల పరిధిలోని కొన్ని మండలాలు, డివిజన్ కేంద్రాల్లో సమావేశాలను నిర్వహించి మద్దతు కూడగట్టేందుకు ఆయా జిల్లాల నేతలు ఏర్పాట్లను చేస్తున్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఈ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం ముందస్తుగానే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ఉండటం వల్ల తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తమకు కలిసివస్తుందని రెండు పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు.

పోటీకి ముందుకు రాని బీఆర్ఎస్

కాంగ్రెస్, బీజేపీలకు భిన్నంగా బీఆర్ఎస్ పార్టీ నేతలు ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీలో దించడం లేదన్నట్లు పార్టీ వర్గాల బట్టి తెలుస్తోంది. గ్రాడ్యుయేట్ (తరువాయి 10వ పేజీలో..)

జిల్లా అంతటా ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



ఏర్గట్లలో మార్కండేయ మందిరంలో పూజలో పాల్గొన్న భక్తులు



ముప్కాల్‌లో సంఘ సభ్యుల మౌనం పాటిస్తున్న దృశ్యం



బ్రహ్మణ్‌పల్లిలో ..



నవీపేటలో..



భీమ్‌గల్‌లో..

ఏర్గట్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల ఆరాధ్యదైవమైన మార్కండేయుని జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు.అందులో భాగంగా మండల కేంద్రంలోని శివ మార్కండేయ మందిరం వద్ద పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నప్రసాదం నిర్వహించగా మండలంతో పాటు ఆయా గ్రామాల్లోని భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాకేష్, శుక్లాజి, పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: పద్మశాలిల ఆరాధ్యదైవంగా భక్త మార్కండేయ జయంతి వేడుకలు ముప్కాల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పద్మశాలి సంఘ భవనంలో మార్కండేయ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుల బంధువుల అందరిలో ఐక్యతను సంఘటిత శక్తి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రసాదించాలని వేడుకున్నారు. కుటుంబసభ్యులతో అన్నదానంలో పాల్గొన్నారు.

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ మందిరంలో శనివారం పద్మశాలి కులస్తులు శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గెంటిల సాయిలు, ఉపాధ్యక్షులు జంగం సత్యంరాజ్, దెగ్లూర్ గంగాకిషన్, ప్రధాన కార్యదర్శి గుడ్డేటి వార్ కార్తీక్, కోశాధికారి దత్తు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో శనివారం మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. మార్కండేయకు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నిట్ శేఖర్, సభ్యులు కలిసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మార్కండేయ జయంతి సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం నాయకులు రుద్ర రాజేశ్వర్, కిషన్, రాంచందర్, గంగాదర్, కిషన్, శ్రీనివాస్, కపిల్, సతీష్, హన్మండ్లు, మహిళలు పాల్గొన్నారు.

నవీపేట: శ్రీ భక్త మార్కండేయ జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, తొట్లె, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ మందిరంలో మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను ప్రసాదించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు అంబల్ల శీను, గణపురం సంతోష్, కొక్కుల రవి, పిట్ల రాజు, సర్వసమాజ్ ప్రతినిధి చక్రధర్, లింబాద్రి, బడుగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన శివభక్త మార్కండేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై పూజలు నిర్వహించారు. భగవంతుని ఆశీస్సులతో అందరు బాగుండాలని కోరుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: పద్మశాలిల ఆరాధ్యదైవం భక్తమార్కండేయ జయంతి ఉత్సవాలను కమ్మర్‌పల్లి మండలంలోని పద్మశాలి సంఘ భవనంలో గ్రామ పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి పద్మశాలి సంఘం పాలకవర్గ సభ్యులు, పద్మశాలి సభ్యులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పద్మశాలి కులదైవం మార్కండేయ మహాముని జయంతి వేడుకలను పద్మశాలి సంఘం తర్ప-2 ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మురళీ, గంగాధర్, గోవింద్, బాస్కర్‌పాల్గొన్నారు.

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ మందిరంలో శనివారం పద్మశాలి కులస్తులు శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గెంటిల సాయిలు, ఉపాధ్యక్షులు జంగం సత్యంరాజ్, దెగ్లూర్ గంగాకిషన్, ప్రధాన కార్యదర్శి గుడ్డేటి వార్ కార్తీక్, కోశాధికారి అంకం దత్తు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టించడంలో ఆర్యవైశ్యులదే ప్రధాన పాత్ర

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించడంలో ఆర్యవైశ్యులు ప్రధాన పాత్ర పోషిస్తారని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ సాయి అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే దన్పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సేవభావం కలిగినవారని అన్నారు. ఆర్యవైశ్యులు సేవ కార్యక్రమాలతో పాటు రాజకీయాలలో సేవలందించేందుకు ముందుకు రావాలని అన్నారు. దేశంలో డెబ్బై శాతం సంపద ఆర్యవైశ్యుల నుండి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పడకల్ వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి



పూజలు చేస్తున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పడకల్ గ్రామాభివృద్ధితో పాటు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి తనవంతు అన్ని విధాల కృషి చేస్తానని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం జాతర ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో స్వామివారికి కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారికి కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కళ్యాణాన్ని భక్తులు, గ్రామస్థులతో ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పడకల్ గ్రామం అంటేనే తనకెంతో అభిమానమని, ఈ గ్రామాభివృద్ధికి, ఆలయం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఆలయంలో కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆలయంలో రాజగోపురం నిర్మాణానికి ఎండోమెంట్ ద్వారా దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఆదివారం స్వామివారి రథోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో మాజీడీసీఎంఎస్‌చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్నసాయిరెడ్డి, కిషన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం, బోండ్ల అరుణ్, శ్రీధర్, పడకల్ వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజ రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో నిర్మించనున్న వెయ్యి నామాల వెంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రం అందజేశారు. శనివారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కల్లెం బోజారెడ్డి, మూలకిడి శ్రీనివాస్‌రెడ్డి, పెర్కిట్ రమేష్ కల్లెం మోహన్, తదితరులు ఉన్నారు.

తొర్లికొండలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు చేరుకొని స్వామివారి కొండుచుట్టు పల్లకి సేవ నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండల శివారులోని మంజీర పరివాహక ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వ అనుమతి పత్రాలు ఉన్న ట్రాక్టర్లు మాత్రమే ఇసుక రవాణా చేయవచ్చన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇట్టి వాహనాలను సీజ్ చేయబడతాయని హెచ్చరించారు.

● సాలంపాడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

బోధన్ మండలంలోని సాలంపాడ్ గ్రామంలో రైతుల పంట పొలాల్లో నుండి శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తుకెళ్లారని ఎస్‌ఐ తెలిపారు. దొంగలను సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి పట్టుకున్నామన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని టీఎల్‌వీ పద్మ సింగ్ అన్నారు. డీఎల్ఎస్ఏ జిల్లా ఆదేశాల మేరకు శనివారం బోధన్ పట్టణంలోని గంజ్ ప్రాంతంలో ఉన్న వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంటగది, ఆట స్థలం, వసతి గృహ పరిసరా ప్రాంతాలను పరిశీలించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, మెనూ ప్రకారం తప్పకుండా నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత పట్ల ప్రత్యేక అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చి పెట్టాలన్నారు. ఆమె వెంట పీఎల్‌వీ రమణ రెడ్డి, పీఎల్‌వీ సుజాత, కళ్యాణి తదితరులున్నారు.

తాగునీటి ట్యాంకుల పరిశీలన

మోర్తాడ్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్యాట్, ధోన్‌పాల్, గాండ్లపేట్ గ్రామాలను డ్రికింగ్ వాటర్ స్పెషల్‌డ్రైవ్ కింద సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. వాటర్‌ట్యాంకును ప్రతీవారం కచ్చితంగా శుభ్రం చేయించాలని, లీకేజీలకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని, ప్రతీ ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించాలని పంచాయతీ సెక్రెటరీలకు సూచనలు చేశారు. పంచాయతీ అధికారి శ్రీధర్, మీషన్ భగీరథ ఏఈఈ జి.స్వరాజ్, పంచాయతీ సెక్రెటరీలు శ్రీకాంత్, లక్ష్మీదుర్గా, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఆలూర్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న కారు బైపాస్ వద్దకు రాగానే అదుపు తప్పి పొలాల్లోకి దూసుకువెళ్లింది. దీంతో కారులో ఉన్న వ్యక్తులకు ఏలాంటి ప్రమాదం సంభవించలేదు.

'లక్ష డప్పులు, వేల గొంతుకలు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చేపట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య అన్నారు. శనివారం హైదరాబాద్ మహనగరంలో ట్యాంక్ బండ్‌పై 7న నిర్వహించే లక్ష డప్పులు మహ ప్రదర్శన జరగబోతుందని, ఈ ప్రదర్శనకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మాదిగ, మాదిగ ఉప కులాలు అందరు లక్ష డప్పులు, వేల గొంతుకల మహ ప్రదర్శనకు హజరైన విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బోధన్ మండల నాయకులు తాడెం అబ్బయ్య, సాలూర మండల అధ్యక్షులు బూరె శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి రవి మాదిగ, అద్దంకి లింగయ్య, రమేష్, శంకర్, బాలు, శంకర్, శేషు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో కరపత్రాల ఆవిష్కరణ

కోటగిరి: ఎస్సీ వర్గీకరణ అమలుకు తలపెట్టిన లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు పోచిరాం కోరారు. కోటగిరి మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో శనివారం లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన హైదారాబాదులో ఎస్సీ వర్గీకరణ అమలుకై పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన ప్రకటన చేస్తే ప్రభుత్వానికి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. లేని పక్షంలో చావు డప్పులు కొడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాదిగ సోదరులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు భూమయ్య, నవీన్, లింగన్న, అబ్బయ్య, శంకర్, మనోహర్, సంజీవ్, నర్సింలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ కోసం 30ఏళ్ల సుదీర్ఘపోరాటం తర్వాత గత ఏడాది ఆగస్టు 1న సుప్రీం కోర్టును తీర్పును అమలు చేస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ యునైటెడ్ ఫ్రండ్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఎమ్మార్పీఎస్ ఆర్మూర్ మండల ఇన్‌చార్జీ శ్యామ్ మాది గ, చిట్టిబాబు, మైలారం రాము, చిన్నయ్య, మార్క్, సంతోష్, చింటు, గణేష్, రా జగంగారాం, పొన్నాలచంద్రశేఖర్,వినోద్, రమేష్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద హైదరాబాద్‌లో లక్ష డప్పులు వెయ్యి గొంతులతో ప్రదర్శన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చి నాలుగు నెలల కాలం గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకపోవడం వల్ల మందకృష్ణకు ఈ నెల 7న కార్యక్రమం చేపడతామని తెలిపారు.



అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వ హించతలపెట్టిన మాదిగల లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీఎంపీపీ పస్క నర్సయ్య కోరారు. శనివారం ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో మాదిగ సంఘ సభ్యులు సమావేశంలో ఆయన మాట్లాడు తూ ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు తరలివచ్చి కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని, ఈ సమావేశంలో చెలిమెల లక్ష్మణ్, సతీష్, గంగారాం, ఉంగరాల రాజన్న, రాములు, మంగ్లారం నవీన్, రాము పాల్గొన్నారు.

మెండోర: లక్ష డప్పులు వేల గొంతుల వాల్‌పోస్టర్లను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మాకూరి మహేష్‌మాదిగ ఆవిష్కరించారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేల గొంతుల సాంస్కృతిక ప్రదర్శన గోడ పత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేష్‌మాదిగ మాట్లాడుతూ లక్ష డప్పులు వేల గొంతుల మహాఆ ప్రదర్శనను జిల్లా నుంచి వేలాదిగా డప్పులతో బయలుదేరి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ మండల ఉపాధ్యక్షుడు గుంటి నిశాంత్, ఎమ్మార్పీఎస్ నాయకులు గోపి, కోడిచర్ల, దూదిగాం డెవిడ్, మాకూరి గణేష్, రాకేష్, సాయన్న, రిషి, జయరాజ్, ప్రణయ్, రాజారత్నం, సుమాన్, సురేష్, గుంటి సాయన్న, శీను, మాదిగలు, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణ కేంద్రంలోని ఎస్సీవాడలో మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం పత్రులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు గంగారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద ప్రభాకర్, చెప్పాల గణేష్, జెజె నర్సయ్య, లక్ష్మణ్, అశోక్, రాజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

భార్య బాధ తాళలేక గోదావరిలో దూకి ఆత్మహత్యా

నవీపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రావుల దమ్మయ్య(35)అనే వ్యక్తి శుక్రవారం రాత్రి యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. దమ్మయ్యకు పోసాని అనే పెద్ద భార్య, సవిత అనే చిన్న భార్యలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కూలీ పని చేసుకుని జీవించే దమ్మయ్యకు రెండవ భార్య సవిత, ఆమె సోదరి రామవ్వలు తరుచుగా ప్రతి చిన్న విషయానికి గొడవ పడడంతో పాటు బూతులు తిట్టే వారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి అక్కచెల్లెలు అయిన సవిత, రామవ్వలు ఇంటి వద్ద గొడవ పడగా నేను బతికి ఉండడం మీకు ఇష్టం లేదని పేర్కొంటూ దమ్మయ్య బైక్‌పై యంచ గోదావరి వద్దకు వెళ్లాడని అన్నారు. బ్రిడ్జిపైన బైక్, చెప్పులను పక్కకు ఉంచి నదిలో దూకాడని అతని మృతదేహం శనివారం నదిలో నుండి బయటపడిందని ఎస్‌ఐ వివరించారు. మృతుడి సోదరుడు మారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోమన్‌పల్లిలో చిన్నారిపై కోతుల దాడి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో మూడేళ్ల హీరణ్యపై శనివారం కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోహన్‌గౌడ్ జీవన దంపతుల కుమార్తె హీరణ్య తన ఇంటి ప్రహరీ లోపల ఉన్న సమయంలో కోతులు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. హీరణ్యపై సుమారు 20నుంచి 30కోతుల మంద దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గాయపడ్డ చిన్నారిపై చికితకోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజులుగా కోతుల బెడద ఎక్కువైందని ఏ సమయంలో ఎటు వైపు నుంచి దాడి చేస్తాయన్న భయాందోళనలు నెలకొన్నాయి.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్ సీజ్

డొంకేశ్వర్, ఫిబ్రవరి 1 (ఆం ధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను తహ సీల్దార్ నరేష్‌కుమార్ సీజ్ చేశారు. డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో మస్క ట్ చిన్న రాజన్న ఇంటి పక్కన నిల్వ ఉన్న 16ట్రాక్టర్ల ఇసుక డంప్‌పై సమాచారం అందగా ఆర్‌ఐ అశోక్‌సింగ్ చేరుకొని వివరాలను సేకరించికాశపు రవి డంప్ చేసిన ఇసుకను గు ర్తించా రు. ఎటువంటి ఆధారా లు లేకపో వడంతో ఇసుకను సీజ్ చేసి పంచాయతీ ఆధీనంలో ఉంచారు. ఈ ఇసుకను ఈనెల 3వ తేదీన వేలంపాట వేస్తున్న ట్లు తహసీల్దార్ నరేష్‌కుమార్ తెలిపారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

ముప్కాల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన అంకమ్మ పురిటినొప్పులతో రాత్రి 12.30గంటలకు అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గర్భిణీకి నొప్పులు అధికంగా రావడంతో అంబులెన్స్ సిబ్బంది సహకరించడంతో ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో తల్లి, పుట్టిన బిడ్డ క్షేమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

రైతు భరోసా దరఖాస్తు గడువు పెంచండి సారూ!

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారులకు పంట పెట్టుబడి సహాయం అందించేందుకు గాను ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకంకు సంబందించిన ఆన్‌లైన్ సైట్‌ను అధికారులు శుక్రవారం క్లోజ్ చేశారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పంట పెట్టుబడి కింద గత ప్రభుత్వం ఎకరాకు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించగా, గత ఏడాది ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని 6 వేల రూపాయలకు పెంచారు. ఈ పథకం కింద జనవరి 01 2025 వరకు కొత్తగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఈ సారి దరఖాస్తు చేసుకోవాలని నిబంధన విధించారు. అయితే కొందరు రైతులు దరఖాస్తు చేసుకోగా చాలామంది రైతులు దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోయారు. గతంలో రైతు భరోసా(రైతు బంధు) పథకంకు అర్హులుగా ఉన్నవారి వివరాలు గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించేవారు. అయితే ఈ సారి వ్యవసాయ శాఖ అధికారులు రైతు భరోసా పథకంకు అనర్హులను గుర్తించే పనిలో ఉండగా గ్రామ స్థాయిలో రైతుల వరకు సమాచారం వెళ్లలేదు. దీంతో కొత్తగా రైతులు భరోసా పథకంకు దరఖాస్తుచేసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరకు వెళుతుండటంతో ఇందుకు సంబంధించిన సైట్ బంద్ అయిందని అధికా రులు చెప్పడంతో రైతులు నిర్ఘాంతపోతున్నారు. గతంలో రైతు భరోసా పడే సమయంలో సైట్ ఆన్ ఉండేదని, ఈసారి అధికారులు దీనిని జనవరి 31 వరకు కుదించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా 17215 మంది రైతులు ఈ సారి కొత్తగా రైతు భరోసా పథకం అర్హులని వ్యవసాయ శాఖ అధికారుల వద్ద లెక్కలు ఉండగా ఎంతమంది రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నారే వ్యవసా యశాఖ అధికారులకే తెలియాలి. ఈ విషయం గురించి జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ వివరణ కోరగా కొత్తగా రైతు భరోసాకు సంబంధించిన ఆన్‌లైన్ గడువు ముగిసిన మాట వాస్తవమే అని, రానున్న రోజుల్లో ఉన్నతాధికారులు గడువును పెంచే అవకాశం ఉండవచ్చని తెలిపారు.



పిట్లం మండల కేంద్రంలో గల రైతు వేదిక.

తక్కువ ఖర్చుతో ఎక్వేరియం తయారు చేసిన విద్యార్థులు

ముప్కాల్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వాడిపాడేసిన వస్తువులతో తక్కువ ఖర్చుతో ఎక్వేరియం తయారు చేశారు. పాత వాటర్ బబుల్, ఎల్‌ఈడీ లైట్, ఎరేటర్, గవ్వలు, రంగురళ్లను ఉపయోగించి స్థానికంగా దొరికే చేపలను ఉంచి సంరక్షించుకుంటున్నారు.

మున్సిపల్‌ను సందర్శించిన ప్రాంతీయ సంచాలకుడు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మున్సిపల్ కార్యాలయాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వరంగల్ ప్రాంతీయ సంచాకులు సహీద్ మసూద్ శనివారం సందర్శించారు. ఇటీవల నియమించిన వార్డు ఆఫీసర్‌లతో పాటు అన్ని శాఖల సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాలావత్ పూర్ణ

డిచ్‌పల్లిలో అన్‌లాకింగ్ స్కిల్ ఇన్ భారత్ ప్రోగ్రాం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో అన్‌లాకింగ్ స్కిల్ ఇన్ భారత్ అనే థీమ్‌తో డెవలప్‌మెంట్ డైలగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 600 మందిపైగా ఎన్‌జీవోలు స్టార్టప్ కంపనీ ప్రతినిధులు దేశ్‌పాండె కోఫౌండర్ గురురాజ్ దేశ్ పాండె బిట్స్ పిలానీ వీసీ ప్రొ.రామాగోపాల్‌రావు టాస్క్ సీఈవో శ్రీకాంత్‌లు హాజరయ్యారు. కార్యక్రమానికి ఎవరెస్ట్ అధిరోహిత మాలావత్ పూర్ణ హాజరై పర్వాత రోహిత అనుభవాలు పంచుకున్నారు. బర్దిపూర్ శివారులో నిర్మిస్తున్న కాకతీయ సాండ్ బాక్స్ క్యాంపస్ 6నెలల్లో ప్రారంభిస్తామని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. కార్యక్రమంలో కాకతీయ సాండ్ బాక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో హోరాహోరీగా క్రికెట్ లీగ్



విజేతకు బహుమతులు అందజేస్తున్న డీసీపీ బస్వారెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో వెల్‌నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గతనెల 27 నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ శనివారం ముగిసింది. శనివారం జరిగిన ఫైనల్ పోటీ హోరాహోరీగా సాగగా, తెలంగాణ యూనివర్సిటీ జట్టు గెలుపొందింది. ముగింపు కార్యక్రమానికి డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతగా నిలిచిన జట్టుకు, రన్నర్ జట్టుకు బహుమతులు అందజేశారు. నిజామాబాద్, కామారెడ్డి, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, నిర్మల్‌లను నుంచి వివిధ కళాశాలలజట్లు వచ్చేలా చొరవచూపిన వెల్నెస్ హాస్పిటల్స్ వైస్‌ప్రసిడెంట్ బోదు అశోక్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండీలు సుమన్‌గౌడ్, అసద్‌ఖాన్, వివేక్‌రెడ్డి, వైస్ ప్రసిడెంట్ బోదు అశోక్‌కుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

ధర్పల్లి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోగల పసుపు పరిశోధన కేంద్రంవద్ద శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో దుబ్బాక గ్రామానికి చెందిన సాయిలు (52) ట్రాక్టర్ బోల్తా పడటంతో మృతిచెందాడు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో యూరియా సంచుల కోసం మండల కేంద్రానికి బయలుదేరాడు. మార్గమధ్యలో గ్రామ శివారులోగల ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడి ట్రాక్టర్ కింద సాయిలుపడి చనిపోయినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. మృతుడు నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో మృతి చెందినట్లు తెలిసింది. మృతుడిని పోస్టుమార్టం కోసం జిల్లా ప్రభుత్వఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటిపల్లిలో చోరీ

● 14.5 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు

సిరికొండ, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అంకం సత్తయ్య ఇంట్లో దొంగలుపడి సుమారు 14.5 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. మరదలు బాగోలేదని చూడటానికి శుక్రవారం సత్తయ్య కుటుంబం ఇంటికి తాళం వేసి వెళ్లింది. శనివారం ఉదయం 11.30లకు వచ్చి చూసేసరికి ఇంటితాళం పగలగొట్టి ఉందని సత్తయ్య చెప్పినట్లు ఏఎస్సై చెప్పారు. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉందని అందులో ఉంచిన 14.5 గ్రాముల బంగారం కనిపించలేదని చెప్పినట్లు వెల్లడించారు. రాత్రి సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వచ్చి తాళాన్ని పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లారని సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. నిజామాబాద్ నుంచి క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలను సేకరించినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మార్కండేయ జయంతి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మార్కండేయ జయంతి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయ జయంతిని పురస్కరించుకొని వివిధ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయునికి ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు మార్కండేయుని నామస్మరణ చేస్తూ నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిరికొండ, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 2, 3, 4 తేదీల్లో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడలకు సిరికొండ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ ప్రశాంత్ తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులను ప్రధానోపాధ్యాయు భోజారాం అభినందించారు.

ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సు పెంపును నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ప్రొఫెసర్ల రిటైర్మెంట్ వయస్సును 65 ఏళ్లకు పెంచడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని దుబ్బా చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కష్టపడి చదువుకున్నారని, యూనివర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల భర్తీ ద్వారా ఉద్యోగాలు సాధిస్తామని కలలు కంటున్నారని అన్నారు. ఈ సమయంలో రిటైర్మెంట్ వయస్సు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఖాళీలను భర్తీ చేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, నజీర్, రెహన్, సంతోష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని పలు పవర్‌హౌజ్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-1 ఏడీఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన వార్షికోత్సవ పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జెండా బాలాజీ మందిర్ ప్రతిష్ఠాపన వార్షికోత్సవ పూజలు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితులు శ్రీధరాచార్య వేదమంత్రాలు పఠించగా అర్చకులు నాగరాజాచార్య ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై నవ కలశాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ కార్యక్రమాలను నిశితంగా పరిశీలించాలి

● ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రొబెషనరీ అధికారులతో అదనపు కలెక్టర్


ఎం‌ఈఎస్ ప్రొబెషనరీ అధికారుల బృందంతో సమావేశమైన అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో వివిధ అంశాల అధ్యయనం కోసం నిజామాబాద్‌కు కేటాయించిన మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రొబెషనరీ అధికారుల బృందం శనివారం జిల్లాకు చేరుకుంది. 30 మందితో కూడిన అధికారుల బృందం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ అంకిత్‌తో ఆయన ఛాంబర్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధ్యయనం సందర్భంగా వివిధ వర్గాల వారి కోసం అమలువుతున్న కార్యక్రమాల తీరును నిశితంగా పరిశీలించాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పరిస్థితులను ఆకలింపు చేసుకునేందుకు ఈ అధ్యాయనం ఎంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లా స్థితిగతులు, స్థానిక పరిస్థితుల గురించి క్లుప్తంగా వారికి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, డివిజన్, జిల్లాస్థాయి కేంద్రాలుగా అధికారయంత్రాంగం పరిపాలన కొనసాగుతుందని వివరించారు. జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమైనందున 70నుంచి 80శాతంమంది ప్రజలు సాగురంగంపై ఆధారపడి జీవనం సాగిస్తారని చెప్పారు. శ్రీరాంసాగర్, అలీసాగర్ వంటి జలాశయాలతోపాటు జిల్లాలో పరివాహక ప్రాంతం కలిగి ఉన్న జీవనది గోదావరిని ఆధారంగా చేసుకొని వివిధ రకాల పంటలు సాగుచేస్తారని, వరి, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న అధిక విస్తీర్ణంలో పండిస్తారని వివరించారు. కాగా 30 మందితో కూడిన అధికారులను ఆరు బృందాలుగా విభజిస్తూ ఒక్కో బృందానికి ఒక్కో గ్రామం చొప్పున క్షేత్రస్థాయి అధ్యయనం కోసం కేటాయించారు. మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్, సుంకెట్, డొంకల్, నందిపేట్ మండలంలోని సిద్ధాపూర్, వన్నెల్-కే, వెల్మల్ గ్రామాలతోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రొబెషనరీ అధికారులతో కూడిన బృందాలు ఈనెల 8వ తేదీ వరకు క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ భేటీలో డీఆర్‌డీవో సాయాగౌడ్, విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు: ఎమ్మెల్యే

ధర్పల్లి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పుల రాష్ట్రంగా మారిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దుయ్యబట్టారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్ కుటుంబానికే దక్కిందన్నారు. రూ.6.5వేల కోట్లను కేవలం నెలకు వడ్డీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోందని అన్నారు. చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులు పందికొక్కుల్లా దోచుకున్నారని పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పులు చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కోక్కరికి వందల కోట్ల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. రూరల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. కులగణన చేపట్టిన తొలిరాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, నివేదిక త్వరలోనే ప్రజల ముందుకు రానుందని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి గంగారెడ్డి, నర్సయ్య, సుభాష్, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రంజిత్, లింబాగౌడ్, లాలాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉపాధ్యాయసంఘాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించకపోవడం నిరాశకు గురిచేసిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయ పన్నుపరిమితి పెంచడం స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఆదాయ పన్నుస్లాబ్ పరిమితిని రూ.12లక్షల వరకు పెంచడం హర్షించదగ్గ విషయమని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు భద్రీనాథ్ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఉపాధ్యాయ ఉద్యోగులకు ఊరట కలిగించే విషయం అని కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులకు ఈ బడ్జెట్‌లో ఊరట ఇచ్చారని స్టాండర్డ్ డిడక్షన్ ఇంకా పెంచి నో ట్యాక్స్ స్లాబ్‌ను కనీసం రూ.5లక్షలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఇంటర్ లింక్ వ్యవస్థ ఏర్పాటు

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రవీందర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింక్‌లైన్ వ్యవస్థను ఏర్పాటుచేశామని నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరిత్యాల సమయంలో, మెయింటేనెన్స్ సమయంలో, ఇతర కారణాల చేత ఒక లైన్‌లో సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా విద్యుత్ వినియోగదారులకు ప్రత్యమ్నాయ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. 33కేవీ లింక్‌లైన్ వ్యవస్థ నుంచి మరొక 33కేవీ లైన్ మధ్య అనుసంధానంగా ఏర్పాటుచేసి ప్రత్యమ్నాయ విద్యుత్ సరఫరా అందజేయడం సులువుగా ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న 216 33/11కేవీ సబ్‌స్టేషన్‌లలో 19 33 కేవీ లైన్‌లలో ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను చేపట్టినట్లు తెలిపారు.

బ్యాంకు లావాదేవీలు పెంచి రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లావాదేవీలు పెంచడంతో పాటు రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అన్నారు. బ్యాంకు ఆవరణలో అధికారులతో లావాదేవీలపై శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లావాదేవీలు 2వేల కోట్ల రూపాయలకు చేరుకున్నాయని ఆయన అన్నారు. అధికారులు ఉద్యోగుల కృషి వల్లనే ఇది సాధ్యమైందన్నారు. బ్యాంకు బాగుంటేనే సేవలు ఎక్కువగా అందుతాయని అన్నారు. బ్యాంకుల్లో ఇప్పటి వరకు 14 శాతంగా ఉన్న ఎన్‌పీఏను 10 శాతానికి తగ్గించాలని ఆయన కోరారు. దీని వల్ల మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు అవకాశం వస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఈవో నాగభూషణంతో పాటు 63 బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

గద్దర్ పేరుపై రేవంత్‌రెడ్డి రాజకీయం

● దేశద్రోహం కేసులున్న వారికి అవార్డులివ్వరు: బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు


నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): గద్దర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని, గద్దర్‌పై ప్రేమ ఉంటే కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి గద్దర్ పేరుపెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంస్థాగత ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గద్దర్‌పై రాజద్రోహం కేసు పెట్టింది కాంగ్రెస్‌పార్టీ కాదా అని ప్రశ్నించారు. సుమారు 35కేసులు గద్దర్‌పై నమోదు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. మీడియా హెడ్‌లైన్స్ కోసం రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ పార్టీని తూలనాడితే ఊరుకునేది లేదన్నారు. ఓడిపోయే టిక్కెట్‌ను గద్దర్ కూతురికి ఇచ్చి, ఓడించి మళ్లీ అదేస్థానంలో బీజేపీ నాయకుడిని తీసుకెళ్లి గెలిపించుకున్నావన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో ప్రశ్నించారు. నిజామాబాద్, హైదరాబాద్, నల్గొండ, తదితర జిల్లాలకు పేర్లు మార్చాలన్నారు. అర్బన్ నక్సలైట్లపై కాంగ్రెస్‌కు ఇంతప్రేమ ఎందుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ అధ్యక్షుడు దినేష్‌కులాచారి, ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, బొబ్బిలి వేణు, తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ అధ్యక్షుడిగా నామినేషన్ దాఖలు చేసిన దినేష్ కులాచారి

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా దినేష్ కులాచారి నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లకు నామినేషన్ పత్రాలను అందించారు. అధ్యక్షులతోపాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు సైతం నామినేషన్లను దాఖలుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, టక్కర్ హన్మంత్‌రెడ్డి, బీజేపీ పదాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి

ఫేక్ యాప్ పేరుతో మోసగిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖిల్లా, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఫేక్ యాప్‌తో జిల్లా కేంద్రంలో అమయాక ప్రజలను మోసాలు చేస్తూ లక్షలు కొల్లగొడుతున్న ఇద్దరు వ్యక్తులను నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, 5వ టౌన్, రెండోటౌన్ ఎస్సై ఆర్.లక్ష్మయ్య, సిబ్బంది అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చాంబర్‌లో కేసు వివరాలు వెల్లడించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనలో ఉన్న జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఆమెర్, సయ్యద్ ఇమ్రాన్‌అలీలు కలసి ఎంజీఐ పేరుతో ఫేక్‌యాప్‌ను రూపొందించారన్నారు. ఈ యాప్ ద్వారా ఆన్‌లైన్ మోసాలు చేయడం మొదలు పెట్టారన్నారు. వీరద్దరూ తమకు తెలిసిన స్నేహితులను ఇందులో చేర్చుకుని మోసాలకు పాల్పడేవారన్నారు. ఈయాప్ గురించి జిల్లాకేంద్రంలోని హమ్మీకాలనీ, ముజాహిద్‌నగర్, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేసినట్లు విచారణలో తేలిందన్నారు.

● ఎంజీఐ యాప్ ద్వారా జరిగిందిలా..

టెలీగ్రామ్‌లో ఎంజీఐ పేరుతో ఒక ఏపీకే ఫైల్‌ను బాధితులకు పంపి అది వారు డౌన్లోడ్ చేసుకునేలా చేసి తద్వారా వారికి రకరకాలైన ఆఫర్స్‌ల ఆశ కల్పించేవారు. బాధితులను ప్రలోభాలకు గురిచేసి వారిని మభ్యపెట్టి వారితో ఆన్‌లైన్‌లో స్కానర్ ద్వారా డబ్బులు పెట్టించి ఆఫర్ పొందాలంటే మళ్లీ డబ్బులు పెట్టాలని స్కానర్ పంపి మోసాలపాలు చేస్తున్నారన్నారు. ఈ యాప్‌ను పర్చ్యువల్ ఐపీ అడ్రస్ ద్వారా యూఎస్ఏలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్ ఏంజెల్స్ ప్రాంతం నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు నమ్మించారు. వీరిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.


పార్థసారథిని సన్మానిస్తున్న వైద్యులు


సదస్సుకు హాజరైన ఎమ్మెల్యేలు, వైద్యులు

డెంటల్ వైద్యానికి స్వర్ణయుగం

(7వ పేజీ తరువాయి)

తమవంతు చేయూత అందించాలన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో రెండు డెంటల్ కళాశాలలు తన రూరల్ నియోజకవర్గంలోనే ఉన్నాయని ఆరోగ్యశ్రీలో డెంటల్ వైద్యాన్ని కూడా ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించి వైద్యులు తమ సేవాదృక్పధాన్ని నిలుపుకోవాలన్నారు. తెలంగాణలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయం ఎంతో ప్రఖ్యాత చెందిందని అంతేకాకుండా ఖిల్లా డిచ్‌పల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పర్యాటక కేంద్రాలుగా వెలుగొందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వైద్యులు ఈ ప్రాంతాలను సందర్శించాలన్నారు. డెంటల్ వైద్యులు రోజుకు లక్ష రూపాయలు సంపాదించే వృత్తిని వృత్తి కంటే సేవాదృక్పధంపై వైద్య సేవలు అందించి ప్రజల మన్నలను పొందాలన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ తన కుటుంబంలో నలుగురు వైద్యులు ఉన్నారని తాను మాత్రం వ్యాపార రంగంలో రాణిస్తూ నిరుపేదలకు శాసనసభ్యుడిగా సేవలు అందిస్తున్నానని అన్నారు. వైద్యులను దేవుళ్లతో సమానంగా చూస్తారని వైద్య రంగం వ్యాపార రంగంగా మారకుండా సేవా రంగంగా మారాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంటల్ వైద్యులను ప్రభుత్వం నియమించే విధంగా చూడాలని ఇటీవల జిల్లాలో గుడ్కా, పాన్ మసాలాలు విక్రయాలు ఎక్కువగా కావడం వల్ల క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు అధికమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డెంటల్ వైద్యులకు, విద్యార్థులకు తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర డెంటల్ వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ నందకుమార్, డాక్టర్ నర్సింహస్వామిలు మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని విలువైన సమయాన్ని కేటాయించిన నలుగురు ఎమ్మెల్యేలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ ప్రతాప్‌కుమార్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదం చేస్తాయని తెలంగాణ ప్రాంత ఆసుపత్రుల్లో దంతవైద్యులు పూర్తిస్థాయిలో లేరని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ జిల్లాలో డెంటల్ వైద్యుల సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తామని సభ్యత్వ నమోదు కూడా పెంపుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ పరమేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల డెంటల్ వైద్యులు, డెంటల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాన పార్టీల దృష్టి!

(7వ పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ ఎన్నికల కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ఎక్కువ సీట్లు గెలిచేందుకు వారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గెలిచినా పెద్దగా తమకు అనుకూలించదని నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో స్థానిక సంస్థల్లో మెజార్టీ సాధించే వచ్చే ఎన్నికలకు ఉపయోగపడుతుందని పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు ఇతర నేతలు భావిస్తున్నట్లు వారు తెలిపారు. పార్టీ నేతల సమా చారం బట్టి బీఆర్ఎస్ అభ్యర్థిని దించకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ కొనసాగే అవకాశం కన్పిస్తోంది. వీరితోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎక్కువ మంది పోటీలోకి దిగనున్నారు. ప్రధాన పార్టీల నేతలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండటం వల్ల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్తర తెలంగాణ జిల్లాలో కీలకంగా మారింది. ఈ ఎన్నికల్లో రెండు పార్టీల నుంచి కీలకమైన నేతలు పోటీలో ఉండటం వల్ల ఇప్పటి వరకు పార్టీ టిక్కెట్ కోసం పోటీ పడిన వారిని ఇద్దరు అభ్యర్థులు బుజ్జగిస్తున్నారు. కరీంనగర్ జిల్లా నుంచే ఎక్కువ మంది పోటీకి సిద్ధమవుతుండటంతో అక్కడి నేతలు ఈ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. టీచర్ ఎమ్మెల్సీకి మాత్రం ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతలు అభ్యర్థులను ప్రకటించడంతో పాటు ప్రచారం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎన్నికలతో పోలిస్తే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కీలకంగా మారింది.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.275	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.84,600	రూ.78,000	రూ.965

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)

స్క్రీన్-2 : మద గజ రాజ (10.10, 10.45)
: డాకు మహారాజ్ (1.20, 7.40)
: దేవ (హిందీ) (4.25)

స్క్రీన్-3 : దేవ (హిందీ) (10.45, 7.15, 10.30)
: మహిష (2.00)
: రొమాంటిక్ లైఫ్ (4.30)

స్క్రీన్-4 : ఏజెంట్ గయ్ 001 (11.15)
: స్కై ఫోర్స్ (హిందీ) (1.30, 10.25)
: మద గజ రాజ (4.15)
: ప్రేమిస్తావా (7.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.40, 4.40, 7.25, 10.00)

స్క్రీన్-2 : ఏజెంట్ గయ్ 001 (11.00, 4.40)
: మద గజ రాజ (1.30, 7.30, 10.20)

దేవి : డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : రాచరికం (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)

లలితామహల్ : మద గజ రాజ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్